
నాటిక :




మీనాక్షి రండిమ లమ్మగారూ! మీకోసమే మానౌకరును మీయింటికి పంపాను మీరు యింట్లో లేరని వచ్చేశాడు

కమల అవును నేను యింట్లో లేని మాట నిజమే బజారుకు వెళ్లాను ఏమన్నా అర్జంటు పనిమీద పంపారా నాదగ్గరికి మనిషిని ?

మీనా అబ్బే! నాకు ఏమీతోచక మీదగ్గరికి మనిషిని పంపాను మీరు మధ్యాహ్నపువేళ ఊరికేనే ఉంటారుకదా అని రమ్మనమని చెప్పాను పచ్చీసు ఆడి చాలా రోజులయింది ఆడుకుందామా ?

కమల మనము యిద్దరమేగా ఉన్నది ఇంకా ఇద్దరుంటేగాని ఆట బాగుండదు ఏమంటారు ?

మీనా ఇంకా ఇద్దరు కావాలా ? ఆఁ ఉండండి మన తారాబాయిని సులోచననూ పిలిపిద్దాము ఒరే రామన్నా! ఇటు రా

రామన్న వస్తున్నానండి ఏందండి అమ్మగారూ!

మీనా ఒరే ఇటుచూడు నీకు సులోచనమ్మగారి యిల్లూ, తారాబాయిగారి యిల్లూ తెలుసుకదూ ?

రామ ఆ ఎవరండి ? నాకు తెలవదండి

మీనా: ఛీ అబద్ధాలు ఆడుతున్నావు వాళ్ల యిళ్లు నీకు తెలియక పోవటమేమిటి? వాళ్లు మనయింటికి వచ్చినప్పుడల్లా నీవు వెంటవెళ్లి పంపించి రావటములేదురా ! వాళ్లే

రామ: ఎవరండీ ? ఆరిల్లు ఎక్కడా ? ఒక్కసారి చెప్పండి

మీనా అబ్బ! ఈ సౌకర్లతో వచ్చిన గొడవేయిది ఎన్నిసార్లు చూసినా 'ఎక్కడుందీ ?' అని అడగటమూ, ఎన్నిసార్లు చెప్పినా 'ఏమిటమ్మా అది ?' అని అడగటమూ మానరు వీళ్లతలలో ఉన్న పదార్థమేమిటో ఆ భగవంతుడికే తెలియాలి ఎంతచెప్పినా వాళ్లకు తెలియదు - మన నోరు నొప్పిపెట్టట మొక్కటే మిగులుతుంది చివరకు

కమ ఉండండి నేను చెప్పతాను రామన్నా! ఇటు చూడు మనము సామానులుకొనే దుకాణములేదురా - దాని ప్రక్కసందులో మొదటియింటికి ఎప్పుడైనా వెళ్లావా ?

రామ ఆయిల్లండీ ? ఆయిల్లైతే తెలుసునండి మాభార్య అక్కడేనండి నౌకరీ చెయ్యటము

కమ (నవ్వి) 'మాభార్య' ఏమిటిరా ? అయితే యిప్పుడు బాగా తెలుసునన్నమాటేకదూ - వాళ్లయిల్లు ?

రామ ఆయిల్లు తెలియకేమండి చెప్పండి

మీనా అమ్మయ్య! ఇప్పటికి తలకెక్కింది గదరా

కమ ఆయింటికి వెళ్లి తారాబాయిగారిని రమ్మన్నామని చెప్పి వచ్చేటప్పుడు సులోచనమ్మగారిని కూడా తీసుకొని రమ్మనమని చెప్పు పచ్చీసు ఆడటానికి రమ్మన్నారని చెప్పు అక్కడే కూర్చోక - తొందరగా రా నీవు

రామ సరేనండి వెళ్లుతున్నానండి

కమ వీడు వెళ్లిచెప్పిన తరువాత వాళ్లు బయలుదేరటానికి ఒకగంట పట్టుతుంది

మీనా: తొందరగానే వస్తారులెండి ఈవేళ ఏమీ తొందరపనులు లేవుకదా మీకు ?

కమ లేవండీ సాయంత్రము ఆరుగంటల వరకూ తీరికేనాకు అయినా పచ్చీసు ఆట అంటే నాకు ప్రాణము దానికోసము ఎంత పనిఉన్నా వదిలిపెట్టి వస్తాను

మీనా: ఆఁ? నాకు పందెము వేయటముకంటె పందెము నడపటమంటే యిష్టము నేను ఆడకపోయినా ఆడేవాళ్ల దగ్గర కూర్చుని కాయలను నడుపుతూ ఉంటాను

కమ కాయలను నడపటమంటే రాజకీయ వ్యవహారాలను చక్కబెట్టనట్లు - ఏమనుకున్నారో! అవును గాని మీరు కట్టుకున్న చీరె ఎక్కడ కొన్నారోగాని చాలా బాగుందిసుమా!

మీనా ఇదా? మావారు ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడినుంచి తెచ్చాడు

కమ చాలా బాగున్నది రంగూ - నేతా - నమోనా అంతా చాలా బాగున్నది అది మీవంటిచాయకు బాగా *Mateh* అయిందిసుమా!

మీనా: (నవ్వి) బాగుందికదూ ? వారికి బట్టలనాణ్యము చాలా బాగా తెలుసులెండి అందులో ఇగ్లండు వెళ్లి వచ్చిన దగ్గరనుండి మరీ నేర్చుకున్నారు తానయినా మంచిమంచి రకాలు ఏరి కుట్టించుకుంటారు

కమ: ఆహాఁ అందులో మంచి *Taste* ఉందేమో ?

మీనా అబ్బ! *Taste* లోకూడా సామాన్యమైన *Taste* అనుకున్నారా ? ఆడవాళ్ల *Fashions* ఆడవాళ్లకంటె బాగా తెలుసును అసలు వారు ఏవస్తువయిన కొనాలంటే ఎంతో ఆలోచిస్తారు ఇంతకూ వారికి ఈఊరు నచ్చలేదంటే నమ్మండి 'దరిద్రపుఊరు ఇక్కడేం దొరుకుతుందం'టారు బనియనుకూడా ఈ ఊళ్లో కొనవద్దంటారు అన్నిటికీ బొంబాయి వెళ్లాలంటారు పర్సులో వందరూపాయల నోట్లు నాలుగయినా లేకపోతే బజారుకు వెళ్లట మేమిటంటారు ?

కమ ఆ,? ఇంత ఊరుంటే మీవారికి ఇక్కడ బనియను దొరకక పోయిందా ? ఆశ్చర్యముగా ఉన్నదే ?

మీనా దొరకవనికాదు విధవరకము దొరుకుతాయని అంటారు నాలుగు నాళ్లయినా ఉండవంటారు వారి కసలు ఇక్కడి వస్తువులు ఏవీ తృప్తికరముగా లేవట

కమ: ఎందుకని ? ఇంతమందికి నచ్చుతున్నాయా లేదా ? ఈఊరుకూడా సిటీలలో లెక్కపడ్డదేకదూ

మీనా సరే అదేమన్నమాట ! అందరికీ నచ్చకపోతే బనియనుకు కూడా బొంబాయి వెళ్లుతారాయేం? వారంటే వారు అమెరికా ఇంగ్లండు స్విట్జర్లాండు అన్నీ తిరిగి వచ్చారు కనుక తొందరగా ఏదీ మెచ్చరు అందులో

నూ వారి అభిప్రాయమేమంటే డబ్బు పెట్టికొన్నప్పుడు నాలుగురోజులపాటు ఆ వస్తువు ఉండకపోతే *Waste* కాదా అంటారు

కమ అయితే మీవారు చాలా జాగ్రత్తకల మనిషన్నమాట నాకు అన్నిటి కంటె బొంబాయివళ్లి బనియను కొనటమే తమాషాగా ఉన్నది

మీనా : తమాషా ఎందుకు ? ఏది పట్టితే అది అందరికీ నచ్చినట్లు - వారికి నచ్చదు ! వారి పద్ధతి అది ఏపని చేసినా - వివరంగా వివేకముగా - జాగ్రత్తగా చేయాలంటారు

కమ (నవ్వు) మీవారు వివేకంగా - వివరంగా అన్నీ ఎనుయూ చూసి చేస్తారనటములో ఇంకేదో ధ్వనించుటము లేదూ ?

మీనా ఏమి టాధ్వని ?

కమ ధ్వనంటె శబ్దము కాదులెండి మీవారు విదేశాలు తిరిగి వచ్చారనటములోనూ - అన్నిటిలో మంచి *Taste* ఉన్నదనటములోనూ, బొంబాయి వెళ్లిగాని బనియనులయినా కొనరనటములోనూ - వంద రూపాయలనోట్లు నాలుగయినా ఉంటే గాని *Shopoping*కు వెళ్లరనటములోనూ- మీవారిని మీరు ఎంత పొగుడుకున్నారో- మిగతావాళ్లను అంత కిందికి దించేశారు (నవ్వు) మా అందరికీ *insult* కాదూ ఆమాట ! ఇంకెవరయినా అయినట్లయితే మనసు నొచ్చుకునేవారు

మీనా : అదే 'మనదగ్గర ఉన్న తెలివి తక్కువ' అని మావారంటారు తెలివిగల వాడినీ - డబ్బుగలవాడినీ చూసి చాలామంది ఓర్వలేరని మావారంటూ ఉంటారు తెలిసితక్కువ వాళ్ల లక్షణమే అది అని మా వారంటూ ఉంటారు అసలు ఈ ఊరే అట్లా ఉందని వారి అభిప్రాయము

కమ : (నవ్వు) మా ఊరికే ప్రమాదము తెచ్చిపెట్టారే ! ఈ ఊరే అంత పనికిమాలినదయితే - ఇక్కడ వారికి ఇస్తున్న అంత పెద్దజీతమూ, ఊరికే యిచ్చిన అంతపెద్ద యిల్లూ - అంతమంది నౌకర్లూ వాటిమాట ఏమిటి ?

మీనా ఆ యేర్పాటు లేనీ సరిగా లేవంటారు వారు నాలుగుదేశాలు తిరిగి చూసినవారు కదండీ - అందుకని వారికి త్వరగా ఏదీ నచ్చదు

కమ : (నవ్వు) అయితే చూశారో లేదో ! ఇంతమంది తెలివితక్కువ వాళ్లు ఉండబట్టే - మీవారి కంత జీతమూ - ఆ సదుపాయాలూ చేస్తున్నారు లోకమంతా తెలివితక్కువగా ఉంటేనే గాని మరి మీవారు *Contrasting* గా తెలివిగల మాణిక్యములలె ప్రకాశించరు ! అందరి తెలివి తక్కువా వారి ప్రతిభకే ఉపయోగపడుతున్నది ఎప్పటికయినా - తెలివి తక్కువతనమూ తెలివీ రెండూ ప్రపంచములో ఉంటేనే గాని ఒకదాని వ్యత్యాసములో మరొకటి రాణించదు అదీ ఒకందుకు లాభించింది మీకు, చూశారా ?

మీనా : అంతే లెండి అదుగో మనవాళ్లు వస్తున్నారు రండిరండి తారాబాయిగారూ సులోచనమ్మగారూ లోపలికి రండి మీకోసమే అప్పటినుంచీ ఎదురు చూస్తున్నాను

కమ యుద్ధముక్క యివ్వండి పచ్చీసు గిల్లి గీస్తాను

## 2 వ రంగము

సులోచన తారాబాయిగారూ ! మీరూ మీనాక్షమ్మగారూ ఒక పార్టీ—నేనూ కమలమ్మగారూ ఒకపార్టీ ఎదురెదురుగా కూర్చోండి మీకు మీపార్ట్నరు ఇష్టమేనా ? ముందు ఆమాట చెప్పండి

కమ నాకు ఎవరున్నా యిష్టమే

సులో మీ కండీ మీనాక్షమ్మగారూ ?

మీనా నాకూ యిష్టమే

సులో మీకు తారాబాయిగారూ !

తారాబాయి నా పార్ట్నరు ఎవరూ ! మీనాక్షమ్మగారా ? సరే ఏంచేస్తాను ? ఒకసారి పెద్దలు పార్ట్నరు అన్న తరువాత నానోటి మీదుగా నేను విడాకులు ఇవ్వను

(అందరూ నవ్వుతారు)

సులో (గవ్వలు గలగల ఆడిస్తూ) అయితే మీ మీ కాయలను చేతిలో పట్టుకొని సరిగా కూర్చోండి మరి మొదట పందెము వేసేది ఎవరు ? ఏమండీ తారాబాయిగారూ ?

తారా మీ యిష్టము ఎవరు ముందుగా వేసినా నాకిష్టమే

మీనా : అట్లా కాదు చూడండి మనము ఊరికే అడిగితే 'ఎవరైనా యిష్టమేన' ని అంటారుగాని తరువాత పేచీలు వస్తాయి రూపాయను ఎగరవేసి చూద్దాము చార్మినారు వస్తే మాదీ—అక్షరాలు వస్తే మీదీను ఏమంటారు ?

అందరు : సరే సరే

(రూపాయను ఎగరవేసిన శబ్దము)

తారా & మీనా. చారుమినారు ! చారుమినారు !

సులో &కమ అక్షరాలు ! అక్షరాలు

తారా &మీనా కాదు ! చారుమినారు !

సులో కాదు బాగాచూడండి తారాబాయిగారూ !

తారా. మీరు బాగా చూడండి సులోచనమ్మగారూ !

కమ అబ్బ ! వారించుకొని లాక్కోకండి సులోచనమ్మగారూ ! మనది కాదు వాళ్లకు ఇచ్చి వేయండి

తారా (గవ్వలు ఆడిస్తూ) పచ్చీసు . దోపచ్చీసు అయ్యో ! మూడవ పచ్చీసు పడ్డదికదండీ కాయ పెట్టటానికి వీలులేదు మీరు తీసుకోండి కమలమ్మగారూ !

కమ (గవ్వలు తీసుకొని పందెము వేస్తుంది) దస్సా నాలుగు సులోచనమ్మగారూ ! గస్సా నాలుగు పందెము పెట్టండి మీనాక్షమ్మగారూ గవ్వలందుకోండి

మీనా (పందెము వేసి) మూడు

సులో అయితే మీ పందెము పెట్టటానికి వీలులేదు

మీనా సరే, మరో అవకాశము ఉంటే చూద్దాము గవ్వలు తీసుకోండి

సులో : (పందెము వేసి) తీస్ . పచ్చీసు నాలుగు మావి మొత్తము మీద మూడుకాయలు ఎక్కినాయి గవ్వలు తీసుకోండి తారాబాయిగారూ !

తారా (పందెము వేస్తుంది) పచ్చీసు దస్ నాగు మీనాక్షమ్మగారూ ! రెండు కాయలను ఎక్కించి పందెము నడపండి కమలమ్మగారూ మీరు గవ్వలందుకోండి

కమ (పందెము వేసి) నాలుగు . అయ్యో ! ఉత్త నాలుగు ! తీసుకోండి మీనాక్షమ్మగారూ ! పందెము వెయ్యండి ఇంతవరకూ మీకు ఒక్క పందెమయినా పడలేదు మీచేతి ఒక్క కాయ ఎక్కలేదు

మీ (పందెము వేస్తూ) అబ్బ ! ఈసారైనా పందెము పడకపోతే - ఈచేత్తో గవ్వలను ముట్టుకోనన్నమాట ! (పందెము వేసి) మూడు పడ్డది - శకునమూడు ! ఏం లాభము కాయలు ఎక్కని దానికి !

కమ మీనాక్షమ్మగారూ ! పిల్లలు అసలే లేకపోవటమూ - ఉన్నా ఒకరో

(19-వ పేజీ చూడండి)

కుష్టు ★ బొల్లి

వగైరా మేహపుచ్చులు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం జి వి రెడ్డి అండ్ కో, (రిజిష్టర్డు) భాస్కరాశ్రమము గోపాలపురం, తూ గోదావరి

# పచ్చీస కాయలు

(11-వ పేజీ తరువాయి)

ఇద్దరో ఉండటమూ ఇప్పటి మన ఫ్యాషన్ గాని-ఈ ఆటలో మాత్రము బాగా పందేలు పడటమూ - ఎక్కువ సంఖ్యలో కాయలు ఎక్కటమూ - త్వరగా చంపుకు అందటమూ - ఘనముగా ఎంచుతారు కాయలు ఎక్కకపోయినా - చంపుడు అందకపోయినా ఈ ఆటలో మాత్రము ఫాషన్ కాదు అపజయ మన్నమాట! ఆటలో ఇంకా పాత ఆచారాలే ఉన్నాయి!

మీ అబ్బ! మీ కెప్పుడూ హేళనే! మాట మాటకూ ఫాషన్ సంగతి ఎత్తుతారు! సులోచనమ్మగారూ! మీరు పందెము వేయండి

సులో ఆఁ (పందెము వేసి) దస్ నాలుగు మావి మరో రెండు కాయలు ఎక్కినాయి తారాబాయిగారూ! పందెము పెట్టుతున్నాను పచ్చీసుతో ఒక కాయా-నాలుగుతో ఒక కాయా - మొత్తము మీవి రెండు కాయలు ఎగిరిపోయాయి

తారా (పందెము వేసి) పచ్చీసు నాలుగు మావి మళ్ళీ రెండు కాయలు ఎక్కినాయి మీరు చంపితే మాకు భయమనుకున్నారా?

కమ (పందెము వేసి) చౌదా నాలుగు

మీనా (పందెము వేసి) దస్ మూడు అమ్మయ్య ఇప్పటికి నాకు పందెము పడ్డది అప్పుడే నా పార్ట్నరు కాయలన్నీ ఎక్కించి ఒక్కటే మిగిల్చింది ఈ పందెముతో అదికూడా ఎక్కింది గాని

సులో: ఎక్కి కూర్చున్నాయి మీ కాయలన్నీ ఇంకా చంపు డందుకో లేదు చంపు డందకపోతే కాయలు పంటకు రావు

కమ అంటే మీ కాయలకు స్వర్గము లేదన్నమాట మీనాక్షమ్మగారూ వింటున్నారా?

సులో పోనీయండి మనము ఎగతాళిగా అన్న మాటలైనా తరువాత కోపకారణాలవుతాయి పందెము నాది కదూ! (పందెము వేసి) పచ్చీసు మూడు మళ్ళీ మీవి రెండు కాయలు ఎగిరిపోయాయి

మీనా మా కాయలు ఎట్లా చచ్చిపోయినాయి?

తారా మా కాయలు ఎట్లా చచ్చిపోయినవో చెప్పండి

కమల: ఎట్లా గేమిటే? పచ్చీసుతో ఒకటీ - మూడుతో ఒకటీనూ

తారా: ఇదివరలో కూడా ఇట్లాగే రెండు కాయలను ఒక్క పందేనికి చంపివేశారు ఏం మీ కొక్కరికే పందెము పెట్టటము వచ్చునని కాబోలు అట్లా చంపేస్తున్నారు

కమల మాకు పందెము పెట్టటము వచ్చునని కాదు ఎవరు పెట్టనా మీ కాయలు చచ్చేవే! పందెము వరుసగా పడ్డది - కాయలు వరుసగా చచ్చాయి! దాని కేమిటి?

మీ ఆ పందెము పడటమూ చూస్తూనే ఉన్నాము! గవ్వలన్నీ చేతిలో పేర్చుకొని పందెము వేస్తే పడదూ మరి? పచ్చీసులూ పడతాయి - తీసులూ పడతాయి

కమల ఛీ ఛీ! నేనట్లా చెయ్యలేదండి

తారా మీ మాటలను మేము ఎట్లా నమ్మగలము?

మీనా అవునండి మీరు చెప్పిన మాట మేము ఎట్లా నమ్ముతాము చెప్పండి పోనీ మేము ఈ మాటంటే మీరు నమ్ముతారా?

కమ ఎందుకు నమ్మము? నిజమైన మాట అందరూ నమ్మవలసిందే!

తారా నిజమైన మాటా! అది ఎట్లా ఉంటుంది?

సులో పందెము పడితే చూసికూడా అట్లా ప్రశ్నిస్తారేమి?

కమ ఎట్లా నమ్మటమూ అనిఅంటే— నేను అబద్ధమాడకుండా ప్రమాణముచేసి చెప్పుతున్నాను కనుకనూ - పందెము చేతికి వచ్చినట్లు వేశాను కనుకనూ-మీరు నమ్మాలి

సులో పందెము వేస్తూఉండగా మీరంతా చూశారుకనుకనూ అందులో ఏమీ కృత్రిమములేదుకనుకనూ మీరు నమ్మాలి

తారా పోటీలు వేసుకొని సమర్థించుకుంటున్నారే యిద్దరూ?

మీనా (వెక్కిరింపుగా) ఎట్లావేసినా బాగానే ఉంటుంది!

సులో ఇంతకూ ఏమిటి మీ ఉద్దేశ్యము?

తారా: మీరు పందెము వేసేటప్పుడే నాకు అదోకలా తోచింది సుమా! గవ్వలన్నీ చేతితో పేర్చినట్లుగానే పడ్డాయి అందుకని ఆ పందేన్ని మేము నమ్మము

కమల మేము గెలుస్తున్నామనా మీరు విచారపడటము?

తారా మాకటువంటి ఉడుకుబోతు వేషాలు లేవు

సులో అయితే మాకు ఉన్నాయనా మీ ఉద్దేశ్యము?

మీనా మేము ఆమాట అనలేదుగాని పందెము మాత్రము ఒప్పము

సులో నమ్మకముగా మేము వేసినప్పుడు మీరు నమ్మకపోతే ఎల్లాగ? ఆట నడచేది ఎట్లా?

తారా & మీనా: మేము నమ్మము. ముమ్మాటికి నమ్మము

సులో నేను అంతనమ్మకముగా వేసిన దానిని మీరు నమ్మకపోతే ఆడటము ఎట్లా?

కమ ఆమె పందెము మీరు నమ్మకపోతే ఎట్లా ఆడుతుంది?

తారా. నమ్మకము లేదుకనుక నమ్మకము లేదన్నాము

సులో అసలు ఇతరులను నమ్మనివారు ఎవరో తెలుసా?

మీనా ఆఁ? ఎవరు చెప్పండి?

తారా ఏమిటో చెప్పండి

సులో అపనమ్మకస్థులే ఇతరులను నమ్మరు

తారా - అంటే ఏ మన్నమాటా?

మీనా అంటే మేము అపనమ్మకస్థులమనా అర్థము?


సులో ఏమో మీ సంగతి మీకే తెలియాలి

తారా: మాకు తెలిసేది ఏమిటండీ? అప్పటి నుంచీ అన్నీ పెడర్థాల మాటలు మాట్లాడుతున్నారు పావలా మందు ఎనిమిది అణాలకు అమ్మటమేనా మాకు తెలిసింది


## రాజా బ్రాండ్ బంగారు కవరింగ్

### ఆభరణములు

కలగు 10 సం॥ గ్యారంటీ




రెండు బాదం, కావ చంద్రహారం ... 24 యించి పేట 1-కి రు 11/- సాదా నల్లపూసల చైను 18 యించి 1 కి రు 5/ ఫ్లవర్ నల్లపూసల చైను 18" యించి 1 కి రు 7/8/ ఆర్డరుతో 800 డిజైనులుగల క్యాటలాగుపంపబడును ప్యాకింగు పోస్టేజి రు 1 0-0 అదనము.

రాజాగోల్డు కవరింగ్ కంపెనీ,(రిజిష్టర్డు)
రాజాబిల్డింగ్సు, మచిలీపట్నం

కమ: ఏం చెయ్యాము మరి? మాకు పుణ్యానికి నౌకర్లూ - ఇల్లూ *Furniture* వస్తున్నాయా మరి?

మీనా: ఓహో! మాటలు మారిపోతున్నాయే! అవన్నీ వారికి గనుక ఇచ్చారు గానీ అందరికీ యిస్తారనుకున్నారా?

తారా: అవును మరి సామాన్యులకు ఇస్తారా మరి?

సులో: మీరు సమర్థించబోకండి కన్నుమూసి కన్ను తెరిచే అంతలో పేరు పేరు వరుసనా ఇళ్ళను కట్టించే మీరు - సర్ది చెప్తున్నారా?

కమ: సులోచనమ్మగారూ! పోనీయండి తగవు పెంచినకొద్దీ పెరుగుతుంది

తారా: ఏమిటండీ పెరిగేది? వీళ్ళ సంగతంతా నాకు తెలుసు ఎందుకని ఊరుకున్నానుగాని వీళ్ళకుటుంబాలలో ఉన్న నీతి నాకు తెలుసు

కమ: అబ్బ! అదంతా ఎందుకు లేద్దురూ?

మీనా: ఏమండోయి మాటలు సరిహద్దులను దాటిపోతున్నాయి అప్పటినుంచీ ఊరుకున్నాను వైద్యులసంగతి మాకూ తెలుసు

కమల: మీనాక్షమ్మగారూ! మాట్లాడేది మనము స్త్రీలము - మగవాళ్ళ ఉద్యోగాలూ - జీతాలూ ఇక్కడ - మనకెందుకు?

తారా: వాళ్ళవి కాకపోతే మనకు ప్రత్యేకముగా ఉన్నాయేమిటి? వాళ్ళవైతేఏం - మనవైతే యేం? అట్లా లాయరు మాటలు మాట్లాడుతారేం?

కమల: అందుకనే మనముకూడా పచ్చీసుకాయలులాగే ఉంటున్నాము

సులో: ఏమండోయి! ప్రపంచాన్నీ ఏలేది వకీళ్లూ డాక్టర్లూ కాదు!

కమ: మరి ఎవరూ? కమిషనర్లూ - ఇంజనీయర్లా?

తారా: ఛీఛీ! ఏమి సంభాషణ! మితిమీరిపోతున్నది ఇటువంటప్పుడు ఆట చాలిస్తేనే మంచిది

సులో: ఇటువంటి చోటికి రావటము నాదే తప్పు

మీనా: సరదాగా ఆడుకుందామని రమ్మన్నానుగాని - నాతో ఆడటానికి వీళ్లు తగనివాళ్లు అందుకే మావారు అందరితో కలియవద్దని చెప్పుతూ ఉంటారు

కమ: వేషములో ఉన్న నాగరికత మాటలోకూడా ఉన్నదని భ్రమించాను సుమా!

తారా: ఎరక్కపోయి వచ్చాను ఇంకెప్పుడూ రాకూడదు ఛీఛీ

మీనా: ఇంకెప్పుడూ పచ్చీసుమాట తలపెట్టకూడదు ఛీఛీ

★

# అర్థంకాని బాధ

(9-వ పేజీ తరువాయి)

కళ్ళు గుమ్మందగ్గర నిలబడిఉన్న నామీద పడ్డాయి

కుడికాలిమీద బరువు ఎడమకాలిమీదికి మార్చుకుంటూ, అంతే నిస్సహాయంగా దీనంగా నేనుకూడా ఆమె కళ్ళల్లోకి చూశాను

సరిగా ఆ సమయంలో నాకు మరొక ఉదంతం తలపుకు వచ్చింది

ఒకప్పుడు ఒక మిత్రుని ఇంటికి వెళ్లాను. నా మిత్రునికొడుకు ఎనిమిది తొమ్మిదేళ్ళవాడు తన కుక్కపిల్లతో ఆడుకుంటూ దానికి గమ్మత్తులు నేర్పుతున్నాడు

కుక్కపిల్ల ఎదురుగా కర్రపుల్ల పెట్టి 'ఊ' అన్నాడు వెంటనే దాన్ని చేత్తో పట్టుకుని పైకెత్తి పుల్లమీదనుంచి దాటించాడు తిరిగి కుక్కపిల్లని మొదటి స్థానంలో కూర్చోపెట్టాడు దాని ఎదుట కర్రపుల్లపెట్టి "ఊ" అని, సంజ్ఞచేశాడు అది అర్థంకానిచూపు చూసి కదలకుండా అలాగే కూర్చుంది

కోపంవచ్చిందేమో ఒక్క దెబ్బ వేశాడు ఆ కుక్కపిల్ల నిస్సహాయంగా దీనంగా వాడివైపు చూచింది తిరిగి కర్రపుల్ల దాని ఎదుటపెట్టి, దూకమన్నాడు అది అలాగే కూర్చునిఉంది

ఏమనుకున్నాడో దానికి మళ్ళీ పాఠం చెప్పాడు తిరిగి పరీక్షాసమయం ఆసన్నమైంది సంజ్ఞచేసి, దూకమన్నాడు అది దూకలేదు కొట్టాడు నాలుగయిదు పర్యాయాలు ఇలాగే జరిగింది ఆ పిల్లవాడు దూకమని ఆదేశించడము, అర్థంకాక అది అలాగే ఉండడము, వాడు కొట్టడము, అది నిస్సహాయంగా వాడివైపు చూస్తూ ఉండడము జరిగింది

ఆ బాలుడికి కోపం రెచ్చిపోయింది ఆఖరిదెబ్బ గట్టిగా తగిలింది అది అన్ని పర్యాయాలు దెబ్బలు తింది అర్థంకాని బాధ పడింది తన తెలివితక్కువకు లోలోపల సిగ్గుపడిందేమో కూడా తిరుగుబాటు చేయలేదు ఆఖరికి తన చిన్ని యజమానిదగ్గర నుంచి పారిపోయి, ఆ బాధ తప్పించుకోడానికైనా ప్రయత్నించలేదు కాని, ఆఖరిదెబ్బ మాత్ర భరించలేకపోయింది కాబోలు వేదనాసూచకంగా ఒక్క మూలుగు మూలిగింది ఆ సమయంలో ఆ కుక్కపిల్ల కూడా తనబాధ తప్పించమని కాబోలు, ఆ గది అంతా అలాగే నిస్సహాయంగా కలయచూసింది


తన ప్రియమైన కుక్కపిల్ల మూలుగు ఆ బాలుని హృదయం కరిగించిందేమో అమాంతం దాన్ని పైకెత్తి పొదివి పట్టుకుని, 'పరవాలేదులే, టైగర్ పాపం నీకు రాలేదేం మళ్ళీ ఇంకోసారి చెబుతాలే' అంటూ దాన్ని ముద్దు పెట్టుకున్నాడు

ఆ కుక్కపిల్ల బాధంతా ఒక్క త్రుటిలో మరిచిపోయి, ఆనందంతో, కృతజ్ఞతతో ఒళ్లంతా వణికిపోతూఉండగా, తన చిన్ని యజమానిమూతి ఆప్యాయంగా నాకింది

ఇంతకీ, అంతలోనే నేను దిగిపోవలసిన స్టేషన్ రావడంచేత, ఆ నా పైలు మిత్రుల ఉదంతం ఏవిధంగా ముగిసిందో చెప్పలేనందుకు క్షమిస్తారుకదూ?

★


కార్‌బైడ్
## గాస్ లాంతర్లు




కొత్త లాంతర్లు, ధరలు తగ్గింపబడినవి 10 సం॥లు గ్యారంటి గవర్నమెంటు ఆఫీసులలో అప్రూవు కాబడినవి మంచి ప్రకాశవంతమైన వెలుతురిచ్చును వెంటనే ఆర్డరివ్వండి అంత తక్కువ ఖరీదుకు యితరచోట్ల దొరకవు ఖరీదు రు 18/ పోస్టేజి వగైరా రు 5/ లు మూడు వారాలు తర్వాత ఖరీదు రు 36/ లు అవుతుంది

**STANDARD W Co**
Post Box 288, Calcutta 1